# ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన నియమావళి

**పథకం వివరాలు**

ఈ పథకం ఒక సంవత్సరానికి వర్తించే జీవిత భీమా పథకం. అయితే ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం పునరుద్ధరించుకోవచ్చును. అంతే కాదు, ఏ కారణంగా మృతి చెందినా ఈ పథకం పరిధిలో బీమా వర్తిస్తుంది. జీవిత బీమా సంస్థ (ఎల్ ఐ సీ), (లేదా) అదే విధమైన నిబంధనలకు లోబడి, బ్యాంకులతో ఒప్పందం కుదుర్చుకుని, ఆమోదం పొందిన ఇతర బీమా సంస్థలు ఈ పథకాన్ని అందిస్తాయి/నిర్వహిస్తాయి. ఇందులో భాగస్వాములైన బ్యాంకులు తమ వినియోగదారులకు ఈ పథకాన్ని వర్తింప చేసేందుకు అలాంటి ఏ బీమా సంస్థతో అయినా స్వేచ్ఛగా ఒప్పందం చేసుకోవచ్చును.

**ఎవరికి వర్తిస్తుంది:** ఈ పథకం అందించే బ్యాంకులలో పొదుపు ఖాతా (సేవింగ్స్ ఎకౌంటు) ఉన్న 18–50 సంవత్సరాల మధ్య వయసుగల ఖాతాదారులు అందరూ ఈ పథకంలో చేరేందుకు అర్హులే. ఒకటి లేదా అంతకంటే ఎక్కువ బ్యాంకులలో అనేక ఖాతాలున్న ఖాతాదారులు ఎదేని ఒక ఖాతా ద్వారా మాత్రమే పథకంలో చేరేందుకు అర్హులవుతారు. బ్యాంకు ఖాతాకు 'ఆధార్' కార్డు ప్రాధమిక 'కె వై సీ' ( మీ ఖాతాదారుని తెలుసుకోండి) గా ఉంటుంది.

**నమోదు కాలం:** పథకం ప్రారంభంలో జూన్ 1, 2015 నుంచి 31 మే 2016 వరకు భీమా రక్షణ గల కాలానికి, పథకంలో చేరుగోరు సభ్యులు 31 మే 2015 నాటికి తమ పేర్లను నమోదు చేసుకుని, ఆటో–డెబిట్ (స్వయంచాలిక ఖర్చు) చేయుటకు ఆమోదం తెలుపవలెను. అయితే ఆలస్యంగా పథకములో చేరగోరువారు మిగిలిన కాలానికి వర్తించేలా, 31 ఆగష్టు 2015 వరకు నయోదు చేసుకునే వీలుంది. ఆ గడువును భారత ప్రభుత్వం మరో మూడు మాసములు, అంటే 30 నవంబర్ 2015 వరకు పొడిగించవచ్చును. ఆ తర్వాత పథకంలో చేరే వారు, నిర్ధారిత నమూనాలో తాము ఆరోగ్యంగా ఉన్నట్లు స్వీయ ధృవీకరణ పత్రం సమర్పించడంతో పాటుగా వార్షిక ప్రీమియం మొత్తాన్ని చెల్లించి మిగిలిన కాలానికి వర్తించేలా సభ్యత్వం పొందవచ్చును.

**నమోదు విధానం :** పైన పేర్కొన్న విధంగా ప్రారంభ సంవత్సరానికి మినహా, ఆ పై ప్రతి సంవత్సరం జూన్ 1 నుంచి మే 31 వరకు భీమా వర్తిస్తుంది. ఇందుకుగాను, ప్రతి సంవత్సరం మే 31 నాటికి పథకంలో చేరేందుకు తమ అమోదాన్ని/వార్షిక చందా (ప్రీమియం) మొత్తాన్ని నిర్దేశిత పొదుపు ఖాతా నుంచి ఆటో–డెబిట్ (స్వయంచాలిక ఖర్చు) ద్వారా చెల్లించేందుకు తమ అంగీకారాన్ని నిర్ణీత నమూనాలో బ్యాంకుకు సమర్పించవలెను. కానీ, ప్రాధమిక గడువు ముగిసిన తర్వాత ఆలస్యంగా సభ్యత్వం పొందాలనుకునే వారు వార్షిక చందా పూర్తిగా చెల్లించి స్వీయ ఆరోగ్య ధృవీకరణ పత్రాన్ని సమర్పించి, సదరు సంవత్సరంలో వార్షిక ప్రీమియం మొత్తాన్ని చెల్లించి, మిగిలిన కాలానికి భీమా వర్తించేలా సభ్యత్వం పొందవచ్చును.

ఎప్పుడైనా, ఏ కారణం చేతనైనా పథకం నుంచి వైదొలగిన వారు, తదుపరి సంవత్సరాలలో ప్రీమియం చెల్లించి, నిర్ణీత నమూనాలో ఆరోగ్య ధృవీకరణ పత్రాన్ని సమర్పించి మళ్లీ తిరిగి సభ్యత్వం పొందవచ్చును.

భవిష్యత్ సంవత్సరాలలో కొత్తగా అర్హత పొందిన వారు (లేదా) ప్రస్తుతం అర్హత ఉండి కూడా గతంలో పథకంలో చేరని వారు (లేదా) పథకం నుంచి వైదొలగిన వారు కూడా ఆరోగ్య స్వయం ధృవీకరణ పత్రాన్ని సమర్పించి పథకం అమలులో ఉన్నంత వరకు ఎప్పుడైనా తిరిగి చేరవచ్చును.

**ప్రయోజనాలు:** ఏ కారణం చేతనైనా సభ్యుడు చనిపోతే రూ. 2 లక్షలు జీవిత బీమా పరిహారం వస్తుంది.

**ప్రీమియం (చందా):** ఒక్కొక్క సభ్యునికి సంవత్సరానికి రూ.330/- ప్రీమియం చెల్లించాలి. ప్రీమియం మొత్తాన్ని ఒకేసారి, ఖాతాదారుని పొదుపు ఖాతా నుంచి 'ఆటో-డెబిట్' సదుపాయం ద్వారా ప్రతి సంవత్సరం మే 31 లోగా, ఒక సంవత్సర కాల జీవిత బీమా రక్షణ కొరకు తీసుకోవడం జరుగుతుంది. మే 31 తర్వాత, భవిష్యత్ కాలానికి, పూర్తి ప్రీమియం చెల్లించి, దానితో పాటుగా స్వీయ ఆరోగ్య ధృవీకరణ పత్రాన్ని సమర్పించి, ఆలస్యంగా కూడా నమోదు చేసుకోవచ్చును. వార్షిక క్లెయిమ్స్ సరళిని బట్టి ప్రీమియం మొత్తాన్ని సమీక్షిస్తారు. అయితే, అనూహ్య పరిణామాలు సంభవిస్తే తప్ప మొదటి మూడు సంవత్సరాల కాలంలో ప్రీమియం మొత్తాన్ని పెంచకుండా ఉంచేందుకు చర్యలు తీసుకుంటారు.

**ఈ పథకంలో చేరుటకు అర్హతలు :**

1) ఈ పథకం అమలు చేసే బ్యాంకుల పొదుపు ఖాతాదారులలో 18 సంవత్సారాలు నిండిన వారినుంచి, 50వ పుట్టిన రోజుకు చేరువలో ఉన్నవారి వరకు, బ్యాంకులో 'ఆటో-డెబిట్' సదుపాయం వినియోగించుకునేందుకు పైన పేర్కొన్న విధంగా సంసిద్ధత తెలిపిన వారు పథకంలో చేరవచ్చును.

2) ప్రారంభ నమోదు కాలం ముగిసిన తర్వాత 31 ఆగష్టు 2015 (లేదా) 30 నవంబర్ 2015 వరకు పొడిగించబడే గడువులోగా పథకంలో చేరే సభ్యులు, తాము మంచి ఆరోగ్యంతో ఉన్నామన్న మేరకు, నమోదు తేదీకి లేదా అంతకు ముందు గాని దరఖాస్తు ఫారం మరియు ధృవీకరణ పత్రంలో పేర్కొన్న విధంగా ఎలాంటి తీవ్ర అనారోగ్యం లేదన్న మేరకు స్వీయ ధృవీకరణ పత్రాన్ని సమర్పించవలెను.

**మాస్టర్ పాలసీ హోల్డర్ :** పథకంలో భాగస్వాములయ్యే బ్యాంకులు మాస్టర్ పాలసీ హోల్డర్లు (సమిష్టి చందా దారు) గా ఉంటాయి. పథకంలో భాగస్వామ్యంగల ప్రాతినిధ్య బ్యాంకు ఎల్ ఐ సీ లేదా ఇతర బీమా సంస్థలను సంప్రదించి సులభమైన, చందాదారుల అనుకూల నిర్వహణ, క్లెయిమ్ పరిష్కార ప్రక్రియను రూపొందిస్తాయి.

**బీమా రద్దు :** ఈ దిగువ పేర్కొన్న సందర్భాలలో సభ్యుల జీవిత బీమా రద్దవుతుంది. ఆ తర్వాత బీమా ప్రయోజనాలు ఏవీ సదరు బీమాదారునికి చెల్లించబడవు.

1) ప్రతి సంవత్సరం ప్రీమియం క్రమంగా చెల్లిస్తుంటే పాలసీదారునికి 55 సం॥నిండువరకు మాత్రమే బీమా రక్షణ వర్తిస్తుంది. తదుపరి వర్తించదు. 50సం॥ వయస్సు నిండిన వారు పథకంలో క్రొత్తగా చేరుటకు అర్హులు కారు.

2) బ్యాంకు ఖాతా మూసి వేసినా లేదా బీమా కొనసాగించడానికి అవసరమైన సొమ్ము ఖాతాలో లేకపోయినా కూడా బీమా రద్దవుతుంది.

3) ఈ పథకంలో ఎవరైనా ఖాతాదారు ఎల్ఐసీ లేదా ఇతర బీమా సంస్థలు ఒకటి కన్నా ఎక్కువ బ్యాంకు ఖాతాల ద్వారా పొరపాటున ప్రీమియం వసూలు చేయుట వలన ఒకటి కన్నా ఎక్కువ పాలసీలు పొందినచో బీమా రక్షణ మొత్తం మాత్రం రూ. 2.00 లక్షలకు పరిమితం చేయబడుతుంది. అదనంగా వసూలైన ప్రీమియం తిరిగి ఇవ్వబడదు.

4) నిర్ణీత తేదీన ఖాతాలో తగినంత సొమ్ము లేకపోవడం (లేదా) ఇతర సాంకేతిక కారణాలు (లేదా) ఏదేని ఇతర కారణాల వలన బీమా రక్షణ రద్దయినట్లయితే అట్టి పాలసీని పూర్తి వార్షిక ప్రీమియం చెల్లించి మరియు మంచి ఆరోగ్యానికి సంబంధించిన సంతృప్తి కరమైన పత్రాలను సమర్పించినచో పునరుద్ధరించుకోవచ్చును.

5) నిర్ధారిత గడువులోగా నమోదు చేసుకున్న వారి ప్రీమియం మొత్తాన్ని ప్రాతినిధ్య బ్యాంకు ప్రతి సంవత్సరం జూన్ 30 తేదీలోగా బీమా సంస్థలకు చెల్లిస్తుంది. ఇతర ఖాతాల విషయంలో ఏ నెలలో ప్రీమియం వసూలైతే ఆ నెలలో బీమా సంస్థలకు చెల్లిస్తుంది.

**పరిపాలన / నియంత్రణ :**

పైన పేర్కొన్న నియమావళికి లోబడి 'ఎల్ఐసీ, పి&జీఎస్' యూనిట్స్ మరియు ఇతర బీమా సంస్థల వ్యవస్థలు ఈ పథకాన్ని నిర్వహిస్తాయి. గణాంక చలన ప్రక్రియ, గణాంక నిర్వహణ నమూనా ప్రత్యేకంగా తెలియ చేయబడుతుంది.

ఖాతాదారుల నుంచి వార్షిక ప్రీమియంను ఏక మొత్తంగా ఒకేసారి, ఖాతాదారులు ఎంపిక చేసుకున్న పద్ధతిలో నిర్ధారిత తేదీన లేదా అంతకంటే ముందు 'ఆటో డెబిట్' ప్రక్రియలో వసూలు చేయవలసిన బాధ్యత ప్రాతినిధ్య బ్యాంకుపై ఉంటుంది.

పథకం అమలులో ఉన్న కాలంలో ప్రతి సంవత్సరం 'ఆటో డెబిట్' ద్వారా ప్రీమియం చెల్లించుటకు సభ్యులు బ్యాంకుకు ఒకేసారి ఆమోదం తెలుపవచ్చును. నిర్ధారిత నమూనాలో నమోదు పత్రం / ఆటో డెబిట్ అధీకృత పత్రం / సమ్మతి మరియు ధృవీకరణ పత్రం ప్రాతినిధ్య బ్యాంకు తమ ఖాతా దారుల నుంచి తీసుకుని, తన వద్ద ఉంచుకుంటుంది. క్లెయిమ్

వచ్చినట్లయితే, ఎల్ఐసీ / బీమా సంస్థలు సదరు పత్రాలను దాఖలు చేయమని బ్యాంకులను కోరవచ్చును. ఈ పత్రాలను ఎప్పుడైనా కోరే హక్కు ఎల్ఐసీ / బీమా సంస్థలకు ఉంటుంది.

రసీదు పత్రాన్ని రసీదు పత్రంగా మరియు బీమా ధృవీకరణ పత్రంగా కూడా పరిగణించవచ్చు. పథకం అమలు తీరు మరియు అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి సంవత్సరం పథకంలో అవసరమైన మార్పులను చేపడతారు.

**ప్రీమియం పంపకం:**

1) ఎల్ ఐ సీ / బీమా సంస్థకు చెల్లించే వార్షిక ప్రీమియం, ఒక్కొక్క సభ్యునికి : రూ. 289

2) బీసీ / మైక్రో / కార్పొరేట్ / ఏజెంట్‌కు చెల్లించే వార్షిక ఖర్చులు : రూ. 30

3) ప్రాతినిధ్య బ్యాంకుకు ఒక్కొక్క సభ్యునికి సంవత్సరానికి చెల్లించే నిర్వహణ వ్యయం: రూ. 11

పథకం ప్రారంభానికి ప్రతిపాదిత తేది 1 జూన్ 2015. తదుపరి ప్రతి సంవత్సరం పునరుద్ధరణ తేది: జూన్ 1వ తేదీ.

పరిస్థితులను బట్టి అవసరం అయితే తదుపరి పునరుద్ధరణ తేదీ కంటే ముందుగా ఈ పథకాన్ని నిలిపి వేయవచ్చును.